# బేరం చెయ్యండి

"పార్లమెంట్ రద్దయిందిట రాజ్యం" అన్నాడు కామేశ్వరరావు వరండాలో పేము కుర్చీలో తీరిగ్గా కూర్చొని పేపరు తిరగేస్తూ.

"ఎందువల్ల ?" అంది రాజ్యం వరండాపక్కనే ఉన్న పారిజాతం చెట్టు విదిలిస్తూ.

"పార్లమెంట్ సభ్యులకి బేరాలు కుదరక."

"ఏ బేరాలు?"

"బేరాలు అనేక రకాలు. ఓ గిద్దెడు పారిజాతం పూలిచ్చి అమ్మాయికీ, అబ్బాయికీ పెళ్ళి సంబంధాలు కుదర్చమని నువ్వు డిమాండ్ చేస్తావనుకో. దేవుడు సరేనంటాడనుకో. అది బయర్స్ మార్కెట్. అలా కాదు, కొబ్బరికాయ, వడపప్పు, పానకం వగైరా కూడా ఇచ్చుకోవాలి. ఒకరోజు కాదు, అనుగ్రహం కలిగేదాకా యివ్వాలిసిందేనని దేవుడు భీష్మిస్తాడనుకో, అది సెల్లర్స్ మార్కెట్. ఇలా బయర్లూ సెల్లర్లూ అంటే కొనుగోలుదార్లూ, అమ్మకందార్లూ వొకరి దగ్గర్నించి యింకొకరు లాభం గుంజుకోవాలని, గుంజుకోవటమే బేరం పరమ రహస్యం. తత్ఫలితమే లాభం లేదా నష్టం. తదాచరణమే మానవకోటి మహాధ్యేయం" కామేశ్వరరావు తన ఉపన్యాస పటిమ ఏకైక సభికురాలు రాజ్యంముందు ప్రదర్శించాడు.

"ఓహో! ఇది ఎకనిమిక్సా ?" అంది రాజ్యం. కామేశ్వరరావు అడపా దడపా చేసే మినీ గృహోపన్యాసాల వల్ల ఏ సబ్జెక్టుల విషయా లేమిటో ఆమెకి కొంచెం అవగతమయినాయి.

"కాదూ. సోషియోసైకో పొలిటికో ఎకనమికో డైనమిక్సే. ఇది గీతలోనే వుంది. ఎవడు సర్వధర్మాలను పరిత్యజించి లాభాపేక్షతో బేరాన్ని శరణు పొందుతాడో అతడికి సర్వపాపాలనుంచి మోక్షం ప్రసాదిస్తానని గీత పందొమ్మిదో అధ్యాయంలో శ్రీ భగవానువాచ."

"ఆహాఁ! గీతా పారాయణం పందొమ్మిదో అధ్యాయందాకా వచ్చింది గదా! సంతోషం. చూడండి, ఆ అమ్మేది బంగాళాదుంపల్లా వుంది. కాస్త పిలిచి బేరం చెయ్యండి. మధ్యాహ్నం పెళ్ళి సంబంధం వాళ్ళకి ఫలహారంలోకి బజ్జీలు చేస్తా."

బ్రహ్మాండంగా మొదలైన ఆధునిక గీతోపన్యాసం కూరగాయల బేరంలోకి జారిపోవలసి వచ్చినందుకు కామేశ్వరరావు కొంచెం కించపడ్డా చేసేదిలేక "ఏయ్ బంగాళాదుంపలూ" అని కేకేశాడు.

"ఎవరు బాబూ పిలిచింది?" అంటూ ఆ కూరగాయల అమ్మి గేటు తలుపుతీసి లోపలికి వచ్చి వరండాలో తట్ట దింపుకుంది.

"ఎలా?"

"కిలో రెండు రూపాయలు బాబూ, బంగారంలాంటి సరుకు."

"అదేమిటమ్మా. ఈ నాసిరకమే అలా మండించేస్తున్నావు?"

ఎలాటి నాసిరకమైనా బంగారంలాంటిదని సరుకునాణ్యాన్ని అమ్మకందారు ఆకాశాని కెత్తటం, ఎలాంటి బంగారమైనా నాసిరకమని కొనుగోలుదారు దానికి వంక పెట్టటం బేరానికి ప్రథమ సోపానాలని కామేశ్వరరావుకి తెలుసు.

"ఆదేంటి బాబూ. ఇది నాసిరకమా ? నీలగిరి బంగారమైతే. అసలు మార్కెట్ మొత్తంమీద ఇలాంటి సరుకు దొరుకుద్దా అంట?"

"సరేలే. ఈ రకం రూపాయేగా."

ఇంటిదగ్గరైతే సగంకోతతో. బజార్లో అయితే పావుకోతతో బేరం ప్రారంభించాలని కామేశ్వరరావు సిద్ధాంతం.

"అమ్మబాబోయ్. కొంప గుండమే. రూపాయి ముప్పావలా చేసుకోండి బాబూ."

"రూపాయిన్నర."

"మారాజులు మీరే ఇట్టా బేరంచేస్తే మా బతుకులు ఎట్టా గట్టెక్కుతయ్యి బాబూ."

"సరే, రూపాయి అరవై పైసలు" ఉదారంగా అన్నాడు కామేశ్వరరావు.

"సరే రండి."

రాజ్యం బంగాళాదుంపలు తూయించింది. కామేశ్వరరావు డబ్బిచ్చాడు. ఆ అమ్మి వెళ్ళిపోగానే మళ్ళీ పేపరు తిరగేస్తూ "ఏమిటి చెబుతున్నావు రాజ్యం ?" అన్నాడు.

"ఇవాళ సెలవు పెట్టింది యింట్లోకూర్చుని ఖాతాఖానీ వెయ్యటానికి కాదు. వెళ్ళి యెంతకో అంతకి ఆ హనుమంతరావుగారి యిల్లు సెటిల్ చేసుకురండి. లేక పోతే యింక యింట్లోంచి సామాన్లు బయట పారేయిస్తాడు ఈ యిల్లు గలాయన. అబ్బాయికి వుద్యోగం కోసం ఆ జగన్నాథం రికమెండ్ చేస్తానన్నాడుగదా. అదేదో తేల్చుకురండి. దార్లోనేగా సుందరరామయ్యగారి యిల్లు. అమ్మాయికి వాళ్ళ మేనల్లుడి సంబంధం విచారించిరండి. పోయినచోటే కూర్చోక చప్పున తిరిగిరండి. మధ్యాహ్నం అబ్బాయి పెళ్ళి సంబంధం వాళ్ళొచ్చే లోపల భోజనాలు చేసి రెడీగా వుండాలి." ఉత్తర్వులు జారీచేసింది రాజ్యం.

"లిస్టు చిన్నదే!" అన్నాడు కామేశ్వరరావు కొంచెం బరువుగా.

"ఇంకా పేర్లు కలపకుండా రమ్మనే చేప్పేది" అంది ఆమె.

"సరే. ఆ కండువా ఇలా ఇవ్వు."

రాజ్యం ఇచ్చిన కండువా తీసుకొని రోడ్డు మీదికి వచ్చాడు కామేశ్వరరావు. రిక్షా ఎదురు పడ్డది.

"రైలుపేటకి ఎంతయ్యా?"

"రూపాయిన్నరండి."

"రూపాయి."

"బస్‌స్టాండ్‌కే రూపాయి యిస్తారుగద బాబూ."

"సరే, రూపాయిపావలా, వస్తే రా, లేకపోతే లేదు నీ యిష్టం."

"రండి."

కామేశ్వరరావు రిక్షా యెక్కి కూర్చున్నాడు. రిక్షా జోరుగా పోవటంలేదు.

"ఏమిటోయ్. నీరసంగా పోనిస్తున్నావు. రాత్రి అన్నం తినలేదా ఏం?"

"లేదు బాబూ."

కామేశ్వరరావు గతుక్కుమన్నాడు.

"ఏం? డబ్బుల్లేవా?"

"లేకేం బాబూ, నేను రోజుకి పది రూపాయలు సంపాయిస్తానండి."

"మరి?"

"నిన్న మధ్దినేల పావు కిలో మాంసం కొని వండమని నా భార్య కిచ్చినానండి. అదొండలేదండి. పోనీ రేత్తిరికైనా వండమన్నానండి, వండలేదండి. పావు కిలో మాంసం కుళ్ళబెట్టేసింది. అసలు అన్నమే వండలేదండి."

"ఎందువల్ల?"

"నేను చుక్కేసుకొస్తానని దానికోపమండి."

"మరైతే ఎలా? ఏవో రాజీ బేరానికి రావాలిగా" నవ్వుతూ అన్నాడు కామేశ్వరరావు.

"అదేనండి మరి. ఇయ్యాల పొద్దున 'ఇంక తాగన్లే' అని పెమాణం చేసినానండి. 'అలాయితే చేపలట్టుకురా, వొండుతా' నందండి."

"భేష్" అన్నాడు కామేశ్వరరావు.

లిస్టులో మొదటి పేరు హనుమంతరావు ఇంటి ముందు రిక్షా ఆగింది. అతనికి డబ్బిచ్చి పంపివేసి ఆ యింటి ప్రక్కభాగం అద్దె బేరానికి దిగాడు కామేశ్వరరావు. ఇల్లు గల ఆసామీ హనుమంతరావు నూటయాభై కి తగ్గనన్నాడు.

"అయ్యా హనుమంతరావుగారూ, నూటయాభై యేమిటండీ. దివ్యంగా రెండొందలైనా యివ్వొచ్చు ఈ యింటికి, అసలు యిన్ని సౌకర్యాలు గల యిల్లు, అందులోనూ మీలాంటి సజ్జనుల పొరుగు లభించడం సామాన్యమా!" బేరంలో మొదటిపాఠం కొంచెం తలకిందులు కాక తప్పదు కొన్ని సందర్భాలలో. కామేశ్వరరావుకి ఆ రహస్యం తెలుసు.

"అహఁ....దాందేముందిలెండి....మాకు మాత్రం మీలాంటి సంస్కారమున్న ఇరుగు దొరకటం మాటలా?" హనుమంతరావు కొంచెం ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

"ఏదో మీ సరసనే వుండాలని కోరిక. కలిసి మెలిసి వుంటాం. అందులోనూ ఏదో తాలూకాఫీసులో ఉద్యోగం కదా నాకు....మీకూ తాలూకాఫీసు పన్లుంటాయి. రెవెన్యూ డిపార్ట్‌మెంటే మీ ఇంట్లో వుంటుందనుకోండి. వేరే చెప్పేదేముంది ? కరెంట్‌తోసహా నూటఇరవైకంటె ఇవ్వటం మరి నా శక్తికి మించింది. మునిసిపాలిటీ పన్నులు ఎక్కువ పడకుండా అరవైకే రసీదిస్తాను. అసలా విషయాలన్నీ నేను చూసుకుంటాగా....ఇంక కాదనకండి....ఎల్లుండి బావుంది, ప్రవేశిస్తాం."

హనుమంతరావుకి మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా అంతా పరిష్కారమై పోయినట్లే మాట్లాడాడు కామేశ్వరరావు. ఆయన కొంచెం ఇబ్బందిలో పడి ఏమీ అనలేక సరే నన్నట్లు తలూపాడు.

విజయోత్సాహంతో కామేశ్వరరావు అక్కడికి దగ్గర్లోనే వున్న జగన్నాథం ఇంటికి దారి తీశాడు.

"ఏమండీ జగన్నాథంగారూ, మా వాడిని మీ బాంక్‌లో ఎప్పుడు జాయిన్ చేయించేస్తారూ. ఏమిటీ. ఆ వైనం కాస్త చెప్పండి మహానుభావా!"

కుశల ప్రశ్నల జోలికికూడా పోకుండా సరాసరి వ్యవహారంలోకి దిగాడు కామేశ్వరరావు.

"మా బ్యాంకేమిటండోయ్!"

"అదేలెండి. మీ మాట చెల్లుబడి అయే బ్యాంకు. వాళ్ళకి మీ మాటంటే కరెన్సీ నోటేగా....అదే లీగల్ టెండరేగా" అనుకోకుండా వచ్చిన వ్యంగ్యాన్ని కప్పి పుచ్చుతూ అన్నాడు కామేశ్వరరావు. జగన్నాథం ఏమీ మొహమాటపడలేదు.

"ఏమిటోనండి. అంతా కరెన్సీమయమే. ఏదో నా మాటకి యింకా కాస్త విలువ యిస్తున్నా రనుకోండి. ఆరువేలు లేంది కాగితంమీద సంతకం చెయ్యటానికి కలం రావటం లేదంటున్నాడు మా తోడల్లుడి మేనత్తకొడుకు ఫ్రెండు."

సగంకోత సిద్ధాంతం మనసులో మెదిలింది కామేశ్వరరావుకి.

"అహఁ....అలా అంటే ఎలా ? మావాడు బి.కాం. హై సెకండ్ క్లాస్ గదా! నా పరిస్థితి, మన స్నేహం, కులం వగైరాలన్నీ చూసి మరి నాకు సగం కన్సెషన్ యిప్పించక తప్పదు."

"సగం కాకపోయినా యింకో వెయ్యికి సరిచెయ్యటానికి చూద్దాంలెండి."

అలా అంటే పని అయినట్టేనని కామేశ్వరరావుకి తెలుసు. పైది ఆయన సొంతానికేననీ తెలుసు, స్నేహం దారి స్నేహానిది, డబ్బుదారి డబ్బుది!

"ఈ ఉపకారం మీవల్ల జరగాలిసిందే."

జగన్నాథం చేతులు పట్టుకు కమిట్ చేయించి కామేశ్వరరావు ఉల్లాసంగా సుందరరామయ్య ఇంటికి బయల్దేరాడు. ఆయన గేటు బార్లా తెరిచి వీధిలో రాక

పోకలు గమనిస్తున్నాడు. "రండి రండి" సుందరరామయ్య ఆహ్వానించాడు. "మహాత్ములు ఊరక రారు."

"మహాత్ముల ఇళ్ళకి ఊరికే రారు అనండి, మీ మేనల్లుడు ఒక అబ్బాయి ఇంజనీరింగ్ పాసయ్యాట్టగదా! విన్నటిదాకా నాకు తెలీక సుమండీ. అమ్మాయికి ఈడూ జోడూగా వుంటాడు. సంప్రదాయంగల కుటుంబం. విచారించరాదా" అని మా పక్కింటి రామ్మూర్తిగారన్నారు. అమ్మాయి మీకు తెలుసు. బంగారంబొమ్మ. బి.యే. చదువుతోంది. మరి మీవల్లే ఈ సంబంధం నిశ్చయం కావాలి. మీతో సంబంధం అంటే నాకు పరమానందంగా వుంది."

"ఆహాఁ. అంతకంటేనా!" సుందరరామయ్య ఆలోచనలో పడ్డాడు.

"ఏదో నేనూ అందరిలాగే అంతో ఇంతో కట్నం ఇవ్వటానికి వెనుకాడేవాడిని కాను."

"ఎబ్బెబ్బె....అసలు వాళ్ళు కట్నం తీసుకోరండీ. కట్నంపేరు చెబితే మా వాడు చిందులు తొక్కుతాడు. అసలు మీ అమ్మాయి కంటే వాడికి చక్కటి పిల్ల దొరుకుతుందేమిటి!"

కామేశ్వరరావు ముఖం విప్పారింది.

"మీ చలవవల్ల ఈ సంబంధం కుదిరితే నాకింక కావలసింది లేదు."

"మీ కేమిటండీ, నాకు మాత్రం? అయితే వాళ్ళకో కోరిక వుంది. అన్నట్లు మీ అబ్బాయి బి.కాం. పాసయ్యాడు కదూ?"

"పాసయ్యాడు, ఉద్యోగప్రయత్నంలో వున్నాడు."

"అమ్మాయ్. ఓసారి యిలా రామ్మా" సుందరరామయ్య లోపలికి చూస్తూ కేకేశాడు.

చిరుగజ్జెల రవళిలో ఓ చిన్నారి అక్కడికి చేరింది.

"పెళ్ళికొడుకు చెల్లెలండీ కామేశ్వరరావుగారూ."

"అలాగా! ఏం పేరమ్మా?" ఆ అమ్మాయిని తేరిపారచూస్తూ కామేశ్వరరావు అడిగాడు.

"మాధవి" అంది ఆ అమ్మాయి. కామేశ్వరరావు వైపు తలెత్తి చూసి. కామేశ్వరరావు ఉలిక్కిపడ్డాడు. కాస్త కఠోరస్వరం, ఓ విధమైన వాలకం, చెయ్యి ఒకటి పీలగా వుంది.

"ఏం చదివావమ్మా?" పలకరించకపోతే బాగుండదని అన్నాడాయన.

"మెట్రిక్."

"చిన్నప్పుడు పోలియో వచ్చిందండీ. పాపం. అసలు మహా చురుకైన పిల్ల. చెయ్యి కొంచెం అవుడైనా పనిపాటల్లో మహా చురుకు. చొరవ వుంది. ఎందుకొచ్చిన చదువులని మెట్రిక్‌తో ఆపేయమన్నాడు వాళ్ళ నాన్న. ఇంక లోపలికి వెళ్ళమ్మా!" సుందరరామయ్య అన్నాడు. ఆ అమ్మాయి దిద్దిమ్మని నృత్యం చేస్తున్నట్లుగా జర్రున లోపలికి వెళ్ళింది.

"సంబంధాలు చూస్తున్నారా?"

"అదే చెబుతున్నా వాళ్ళ తల్లిదండ్రులకి, కుండలమార్పిడి కావాలనివుంది. అలా అయితే పొరపొచ్చాలు లేకుండా సాయిలా పాయిలాగా వుంటారని వాళ్ళ నమ్మకం. మీ అబ్బాయికి చేసుకో కూడదూ?"

"మా అబ్బాయికా?" వులిక్కిపడ్డాడు కామేశ్వరరావు.

"దివ్యమైన సంబంధం. మా మేనల్లుడని కాదుగాని ఎలాంటి కుర్రాడండీ. ఎర్రగా, బుర్రగా, పొడుగ్గా, దొరలా వుంటాడు. పెద్ద చదువు, ఐ.ఏ.ఎస్. కి కూర్చోవాలనుకుంటున్నాడు. అది పాసయితే ఇంక మనలాంటి వాళ్ళకి అందడు. ముందే తొందరపడాలి. ఇక ఈ పిల్ల అంటారా. చూశారు గదా! చక్కగా డాన్సు చేస్తుంది. పనీ, పాటలు వచ్చు. ఆడపిల్లకి అంతకంటే ఏం కావాలి. అందమా అదేం కొరుక్కుతింటారా. చెప్పండి."

"ఎబ్బెబ్బె....అది కాదండి. కాని మా వాడికి సంబంధం కుదిరిందండీ. నిశ్చయం చేసుకోటానికి యివాళే వాళ్ళు వస్తున్నారు కూడా."

"ఇంకా నిశ్చయం చేసుకోలేదుగా."

"మాట యిచ్చాంగదా!"

"మాట దేముందండీ? మన మేలు మనం చూసుకోవాలిగాని."

కామేశ్వరరావుకి యేమనటానికీ పాలుపోలేదు. కుర్రవాడిని యెర చూపించి ఈ పిల్లని అంటకట్టాలని సుందరరామయ్య ప్లాను. కట్నం అక్కర్లేదుట! ఓహో! కట్నం ఇవ్వకపోతే, తీసుకోవటమూ వుండదని పాచిక. అమ్మో అసాధ్యుడు!

"సరే ఆలోచించి చెబుతాన్లెండి."

"అలాగే. ఏదో చుట్టపు చూపుగా వచ్చింది అమ్మాయి. సమయానికి మీరు వచ్చి సంబంధం సంగతి ఎత్తారు గనక చెప్పాను. వాడికి చాలా సంబంధాలొస్తున్నాయి. తర్వాత మీ యిష్టం మరి."

ఆ బెదిరింపు ధోరణికి కామేశ్వరరావుకి చిరాకు వేసింది. అప్పటికి ఏదో చెప్పి తప్పించుకొని రిక్షాలో ఇంటిదారి పట్టాడు.

విషయాన్ని రాజ్యంకి చెప్పి భోజనాలు ముగించుకుని, కాస్త విశ్రాంతి తీసుకొని లేచేసరికి, పెళ్ళి సంబంధం వాళ్ళు రానేవచ్చారు. ఫలహారాలూ, కుశలప్రశ్నలూ కాగానే కాబోయే వియ్యంకుడు రంగనాథం విషయం కదిలించాడు.

"మరి కట్నకానుకల సంగతేం చెబుతారు!"

"కట్నం దేముందిలెండి. కాని యిరవైవేలయినా యిస్తాను, ఏమైనా మా అమ్మాయిని చేసుకోవాలిసిందని ఈ మధ్యనే బందరునించి ఓ ఇంజనీరుగారు పట్టు పట్టారండి. అమ్మాయి నచ్చక కుదర్లేదనుకోండి."

"ఇరవై వేలా?"

"అవునండి."

నేనూ ఇరవై ఇవ్వటానికి సిద్ధమే."

కామేశ్వరరావు నోరు తెరిచాడు. రాజ్యంవైపు విస్మయ దృక్కులతో చూశాడు. ఆమె అతనివైపు అలాగే చూసింది. ఆమెకేదో ఆశ కలిగింది.

"లాంఛనాల సంగతి?" కలగజేసుకుంది.

"ఎంతంటారు?"

"మూడువేలంటోంది మా అమ్మాయి."

"అలాగే. అమ్మాయి ముచ్చట తీర్చకుంటానా?"

కామేశ్వరరావూ, రాజ్యమూ అవాక్కయినారు. దిగ్భ్రాంతితో కాబోయే వియ్యంకుడి వైపు గుడ్లప్పగించి చూశారు.

"మరి నిశ్చయమైనట్లేనా?" రంగనాథం బావమరిది ప్రశ్నించాడు.

కామేశ్వరరావు ఈ లోకంలోకి వచ్చాడు. అతనికేదో అనుమానం కలిగింది.

"అబ్బాయి విజయవాడ వెళ్ళాడు. రాగానే కనుక్కుని మీకు కబురు చేస్తాను! ఏమైనా వాడి నోటితో సరేననకుండా మనం నిశ్చయం చేసుకోలేం గదండీ."

"అలాగే. మరి వెంటనే కార్డుముక్క రాస్తారుగదా. పోనీ రేపు మళ్ళీ మేమే వస్తాం."

"ఎబ్బె. ఎందుకండీ శ్రమ. నేను వెంటనే తెలియచేస్తానుగదా" కామేశ్వరరావు కంగారుగా అన్నాడు.

"మీ చిత్తం. మరి మాకు సెలవిప్పించండి."

ఇద్దరూ వెళ్ళిపోయారు. కామేశ్వరరావుకి ఏదో అసంతృప్తిగా వుంది.

"ఇదేమిటి రాజ్యం. పదివేల నుంచి బేరమాడతారనుకున్నా. మారు మాట్లాడకుండా ఒప్పుకున్నారేమిటి?....అంత వున్నవాళ్ళు కూడా కారు."

నాకూ అదే ఆశ్చర్యంగా వుందండి. లాంఛనాలు వేరే అంటే కూడా కిక్కురు మనలేదు."

"ఇది దొంగసొమ్మో, దొంగ రవాణా సొమ్మో కాదుగద."

"ఈ మధ్య దొంగనోట్లు తెగ మారుస్తున్నారట. ఆ బాపతేమో గొడవ!"

"కట్నం పుచ్చుకొన్నామని మన్ని జైల్లోకి పంపటానికి పన్నిన కుట్రేమో రాజ్యం."

"ఏదో వుందండీ. అమ్మాయికేమైనా లోపం ఉందేమో!"

"మరి ఏమీ లేకపోతే అడగ్గానే మాటవరసకైనా మరోమాట చెప్పండి" అనకుండానే అంత మొత్తం కట్నం ఇవ్వడానికి ఒప్పుకుంటాడు?"

"ఎందుకొచ్చిన సంబంధం లెద్దురూ ! అమ్మాయి చక్కనిచుక్క కాగానే సరా! కొరివితో తల గోక్కుంటామా! మా అబ్బాయి ఇప్పుడు పెళ్ళి చేసుకోనంటున్నాడు, రేపో కార్డుముక్క రాసి పడేసి వొదిలించుకుందాం."

అప్పుడే బూట్లు టకటకలాడించుకుంటూ లోపలికొచ్చి హ్యాండ్‌బ్యాగ్ బల్లమీద పడేసి "ఏమిటి వొదిలించుకుందా మనుకుంటున్నారు?" అన్నాడు రామచంద్ర.

"అదేరా, పెళ్లి సంబంధం. ఆ రంగనాథం గారొచ్చారు. కట్నం ఇరవై వేలంటే సరేనని ఒప్పుకున్నారు. ఏముందో లొసుగు!"

"అదనంగా లాంఛనాలు మూడువేలని నేనంటే వెంటనే సరే నన్నార్రా!"

"అమ్మ ఆ అమ్మాయికేదో లోపం వుందంటోంది. నేననుకోవడం ఇదేదో దొంగనోట్ల బాపతో, లేకపోతే మనల్ని జైల్లో తోయించటానికి పన్నిన కుట్రో అయి వుండాలి. లేకపోతే బేరం లేకుండానే ఇంత కట్నానికి ఒప్పుకొంటారా?"

రామచంద్ర నవ్వాడు.

"ఏం చేస్తారు? అసలే పెళ్లికొడుకులది సెల్లర్స్ మార్కెట్. దానికితోడు ఆ అమ్మాయి నన్ను తప్ప ఇంకెవర్నీ చేసుకోనని వాళ్ల మామయ్యతో చెప్పిందిట. వాళ్లతో సన్నిహితంగా వుండే నా ఫ్రెండ్ ఒకతను ఇవాళ విజయవాడలో కనిపించి చెప్పాడు.

"అదా సంగతి!" కామేశ్వరరావు వదనంలో చిరునవ్వు చిందులాడింది. రాజ్యంకి యెంతో సంతోషం వేసింది.

"మరయితే సంబంధం ఖాయమని వుత్తరం రాసెయ్య మన్నావా?" అందామె సంబరంతో. "ఇంక అడ్డేముంది? రాసేద్దామా రాజం?" కామేశ్వరరావు అన్నాడు.

"మీ యిష్టం, కాని, కట్నం తీసుకొంటే నేను పెళ్ళే చేసుకోను. పెళ్లి చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకొంటాను."

బాంబుపేల్చి రామచంద్ర అక్కడనించి వెళ్ళిపోసాగాడు.

ఇద్దరూ తెల్లబోయారు. కామేశ్వరరావు ముఖం చిట్లించి రాజ్యంవైపు చూసి అన్నాడు.

"ఇంకేం, గొప్ప బేరగాడే అయ్యాడు నీ కొడుకు."

వెళ్లిపోతున్న రామచంద్ర వెనక్కి తిరిగి అన్నాడు.

"తప్పేముంది నాన్నా. జీవితం బేరాల పరంపరే గదా!"

[ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక దీపావళి 1979]